నేడు పీజీఆర్ఎస్ ద్వారా ప్రజా వినతుల స్వీకరణ

కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు.



కర్నూలు నగరంలోని సూర్యదేవాలయం

భక్తిపాశం.. ధనుర్మాసం..

- నేటి నుంచి ఆరంభం
- వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక వేడుకలు



శేషపాన్పుపై రంగనాథ స్వామి వారు

నంద్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందడి ముగిసింది. మార్గశిరం మొదలైంది. సోమవారం నుంచి విష్ణు భగవానుడికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసం ప్రారంభం కానుంది. సూర్యభగవానుడు ధనుస్సు రాశిలో ప్రవేశించి మకర సంక్రమణం వరకూ ఆ రాశిలో ఉండే కాలాన్ని ధనుర్మాసం అంటారు. మార్గశిర మాసంలోనే ధనుర్మాసం కొనసాగుతుంది. అందుకే ఈ మాసం విష్ణుమూర్తితో పాటు సూర్యభగవానుడికి కూడా ప్రీతికరం. ధనుర్మాసం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యాయి. నెల రోజుల పాటు వైష్ణవ క్షేత్రాల్లో రోజూ మహావిష్ణువుకు ప్రత్యేక పూజలు, తిరుప్పావై పఠనం, గోదా కల్యాణం వంటి వేడుకలు జరగనున్నాయి. ధనుర్మాసం ఆరంభంతోనే అటు పల్లె సీమల్లో సంక్రాంతి వేడుకల సందడి కూడా కనిపిస్తుంది. తమ ఇంటి లోగిళ్లను అందంగా ముగ్గులతో తీర్చిదిద్దేందుకు మహిళలు పోటీ పడుతుంటారు. హరిదాసులు, గంగిరెద్దుల ఆటగాళ్ల, జంగమదేవరలు గ్రామాల్లో తిరుగుతూ కనిపిస్తారు. ధార్మిక భావాలకు, ప్రకృతి సంపదలకు నిలయంగా నిలిచే ఈ మాసంలోనే 'సంక్రాంతి' పండుగ కూడా వస్తుంది.

సంక్రాంతి ఆరంభానికి సంకేతం ధనుర్మాసం



గోదాదేవి అమ్మవారు

ధనుస్సు అనే పదానికి ధర్మం అని అర్థం. అంటే ఈ ధనుర్మాసంలో ధర్మాన్ని ఎంతగా ఆచరిస్తే అంతగా శ్రీమహా విష్ణువుకు పాత్రులు అవుతారని పండితులు చెబుతారు. ధనుర్మాసం మార్గశిరంలో వస్తుంది. ధనుర్మాసానికి ఆధ్యురాలు గోదాదేవి. 'గో' అంటే జ్ఞానం అని, 'దా' అంటే అర్థం ఇవ్వడం అని భావన. గోదాదేవి చెప్పిన పాశురాలు ధనుర్మాసంలో విష్ణాలయాల్లో తప్పనిసరిగా గానం చేస్తారు. ధనుర్మాసం ఆరంభాన్నే గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి నెల పట్టడం అంటారు.

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

స్వామి,అమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటల సమయం



పల్లకీలో పూజలందుకున్న స్వామి అమ్మవార్లు



క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

శ్రీశైలం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. భారీగా భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. దీంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి నాలుగు గంటలకుపైగా సమయం పట్టింది. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. ఉదయం నుంచే భక్తులు దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద విశేష పూజలు నిర్వహించుకుని దీపారాధనలను జరిపారు. కాగా సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం నిర్వహించారు. నిత్యకళారాధనలో భాగంగా నెల్లూరు జిల్లా వేంకటేశర ఆర్ట్స్ అకాడమీ బృందం నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకస్తుతి, శివతాండవస్తోత్రం, అయిగిరినందిని, అర్ధనారీశ్వరస్తోత్రం తదితర శైవ గీతాలకు చిన్నారులు మీనాక్షి, శైలజ, తన్మయి, జ్యోత్నశ్రీ, దేదీప్రశాంతి, జాగృతి, మనస్వి, జ్యోష్ణ, మాన్విత, కనిష్కరెడ్డి, సోమకార్తిక, ప్రసన్న, ధాత్రిలక్ష్మి మోక్షిత తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు

నివాళులర్పించిన మంత్రి ఫరూక్, కలెక్టర్

నంద్యాల కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్మరించు కోవాలని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం అమరజీవి పొట్టి శ్రీరాము లు 72వ వర్ధంతిని ఘనంగా నిర్వహిం చారు. నంద్యాల సంజీవనగర్ గేట్ దగ్గర పొట్టిశ్రీరాములు విగ్రహానికి మంత్రి ఫరూక్, కలెక్టర్ రాజకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ ఫలితంగా కర్నూలు రాజధాని కేంద్రంగా 1953 నవంబరు ఒకటోతేదీన ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించిందన్నారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 52 రోజులు కఠోర నిరాహార దీక్ష చేసి 1952 డిసెంబరు 15న పొట్టి శ్రీరాములు అమరుడ య్యారన్నారు. ఆయన త్యాగనిరతికి ఎన్నో రాష్ట్రాలకు ఆదర్శమై ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పాటయ్యే అవకా శానికి నాంది పలికాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, ఆర్డీఓ నాగజ్యోతి, ఇరిగేషన్ ఎస్ఈ సుబ్బరాయుడు, డీఈఓ జనార్ధన్‌రెడ్డి, ట్రెజరీ అధికారి లక్ష్మీదేవి, పశుసంవర్ధక అధికారి గోవిందనాయక్, టూరిజం అధికారి సత్యనా రాయణ, జిల్లా క్రీడల అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి, కలెక్టర్

రాష్ట్రం కోసం పరితపించిన

మహనీయుడు 'అమరజీవి'

రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం అనునిత్యం పరితపిస్తూ ఆత్మార్పణ చేసుకున్న మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు అని రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని పాతబస్టాండ్‌లో అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అంతకుముందు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఈ సంద్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి బీసీ మాట్లాడుతూ నిస్వార్థంగా రాష్ట్రం కోసం పనిచేయడమేగాక స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకు వెళ్లిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అన్నారు. ఆయన వర్ధంతిని అధికారికంగా చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారి చేసింద న్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణ, ఈవో సతీశ్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు, నాయకులు టంగుటూరు శ్రీనయ్య, పీఎస్ఎస్ నారాయణ, గాథంశెట్టి వేణుగోపాల్, శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, భరతుడు, జంగంశెట్టి, సాయిరాం, జక్కా నాగరాజు, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఆర్‌సీ నాగిరెడ్డి, నియాజ్, సలాం, పూల కలాం, మదనగోపాల్, బత్తులగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ

వర్చువల్ క్లాస్‌రూమ్‌ల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంకల్‌బాగ్‌లో ఉన్న మున్సిపల్ బిల్డింగ్‌లో వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాటును కలెక్టర్ పి. రంజిత్ బాషా పరిశీలించారు. ఆదివారం సంకల్‌బాగ్‌లో ఉన్న మున్సిపాల్ బిల్డింగ్‌లో వర్చువల్ క్లాస్ రూమ్ ఏర్పాటు భవనాన్ని డీఈవో శామ్యూల్ పాల్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో పదో తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వర్చువల్ క్లాస్ రూమ్ చిన్నగా ఉండటంతో విశాలమైన భవనంలో ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో నగరంలోని సంకల్ బాగ్‌లో ఉన్న మున్సిపల్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వర్చువల్ తరగతులు నిర్వహించేందుకు స్టూడియో ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ తుంగభద్ర నదీ తీర ప్రాంతాన్ని పరిశీలించారు.

హంద్రీ నీవా నీరు ఎప్పుడిస్తారు..?

- కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగు
- రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగన్నాథం

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో హంద్రీ నీవా కాలువ ద్వారా 80వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించి 12 సంవత్సరాలైనా అమలు చేయడం లేదని సీపీఐ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో.. ప్రస్తుతం హంద్రీ నీవా కాలువ ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం 20వేల నుంచి 30వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నారని అన్నారు. కాలువ నీటి కోసం మోటార్లు ఏర్పాటు చేసుకుని రైతులు భారీగా డబ్బు ఖర్చు పెట్టుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవనకొండ మండలంలోని 40వేల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉండగా.. కేవలం 15వేల ఎకరాలకు మాత్రమే నీరు అందుతోందని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దేవనకొండ మండలంలో పంటల కాలువలను త్వరిగతిన పూర్తి చేయాలని, పందికోన రిజర్వాయర్ రివిట్మెంట్‌ను పూర్తి చేయాలని కోరారు.

కష్టాల్లో ఉన్న రైతుల్ని ఆదుకోండి

- ఉచిత పంటల బీమాను అమలు చేయండి
- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ



కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతులు ఏటా ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతూ వలస బాటపడుతున్నారని, ఇలాంటి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రబీకి మాత్రమే ఉచిత పంటల బీమాను అమలు చేసి ఖరీఫ్‌లో మాత్రమే ఉచిత పంటల బీమాను అమలు చేసి, రబీలో బీమా పథకంలో లబ్ధి పొందాలంటే ప్రీమియం రైతులే చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని మార్చుకుని ఉచిత పంటల బీమాను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 15 వరకే ముఖ్యమైన పంటలకు ప్రీమియం చెల్లించే గడువును నిర్ణయించడం దారుణమని, వరితో పాటు మిగిలిన పంటలకు ఈ నెల 31 వరకు ప్రీమియం చెల్లింపు గడువును పొడిగించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతకొమ్మదిన్నె గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామానికి చెందిన బాబుషా తన ద్విచక్ర వాహనంపై చాగలమర్రి వైపు వెళ్తుండగా కర్నూలు నుంచి కడప వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో బాబుషా అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఆళ్లగడ్డ రూరల్ పోలీసులు తెలిపారు.

బోరు పైపును ధ్వంసం చేసిన దుండగులు



ధ్వంసమైన బోరు పైపు

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో టీడీపీ కార్యకర్త అయ్యన్న పొలంలో బోరు పైపును గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశానని అన్నాడు. శనివారం సాయంత్రం వరకు మొక్కజొన్నకు తడి పెట్టానని చెప్పాడు. మరలా ఆదివారం ఉదయాన్నే మిగిలిన పొలానికి తడి పెట్టడానికి వెళ్లగా బోరు పైపు, విద్యుత్ వైర్లు ధ్వంసమై ఉన్నాయని తెలిపాడు. దుండగుల దుశ్చర్యతో 7 హెచ్‌పీ మోటారు, 50 పైపులు, విద్యుత్ వైరు బోరులోకి జారిపోయాయని కన్నీటిపర్యంతమయ్యాడు. వీటి విలువ సుమారు రూ.1.8 లక్షలు ఉంటుందని వాపోయాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాహనం ఢీకొని బాలుడు మృతి



మదన అశోక్ (ఫైల్)

బనగానపల్లె, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీసుస్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామంలో ఏపీ 39 టీ 0766 బొలెరో క్యాంపర్ వాహనం ఢీ కొనడంతో రామతీర్థం గ్రామానికి చెందిన మర్రి మదన్‌గోపాల్ చిన్నకుమారుడు మదన అశోక్ (14) తలపై తీవ్రగాయాలై మృతి చెందినట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. పాణ్యం మండలం కందకాయపల్లె గ్రామానికి చెందిన కానాలనాగన్న అనే డ్రైవర్ బొలెరో క్యాంపర్ వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి గ్రామంలోని మలుపు వద్ద నిలబడి ఉన్న అశోక్‌ను ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో అశోక్ తల వద్ద కణతకు తీవ్ర గాయాలు కావడంతో బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకుపోగా అక్కడ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. తండ్రి మదన్‌గోపాల్ ఫిర్యాదు మేరకు డ్రైవర్ కానాల నాగన్నపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అలనాటి తలపులు

- నవోదయలో పూర్వ విద్యార్థుల కలయిక
- చిన్ననాటి జ్ఞాపకలను నెమరు వేసుకున్న స్నేహితులు



ఆలింగనం చేసుకుంటున్న పూర్వ విద్యార్థులు



గురువులకు నమస్కరిస్తున్న పూర్వపు విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పదేళ్లకిందటి మిత్రులు మళ్లీ కలుసుకున్నారు. ఎక్కడెక్కడో, ఏ హోదాల్లోనో ఉన్న వాళ్లంతా బాల్యంలోకి వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను తలపోసుకున్నారు. ఎమ్మిగనూరు మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. దాదాపు పదేళ్ల తర్వాత వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో ఉన్న వందలాడి పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. నవోదయ విద్యాలయం పూర్వ విద్యార్థులతో కళకళలాడింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకరినొకరు కలుసుకోవడంతో వారి ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను కలుసుకోవడంతో భావోద్వేగాలకు లోనయ్యారు. గురువులను శాలువాలు, పూలమాలలు, మెమెంటోలు ఇచ్చి సన్మానించారు. తాము చిన్నతనంలో చేసిన అల్లరిని తలచుకొని నవ్వుకున్నారు. దాదాపు 1500 మందికి పైగా పూర్వ విద్యార్థులు సమ్మేళనానికి తరలిరావడంతో జవహర్ నవోదయ విద్యాలయం కళకళలాడింది.

నాయకత్వ లక్షణాలను విద్యాలయం నేర్పింది



నవోదయ విద్యాలయంలో చదువుకున్న మా మిత్రులు వివిధ హోదాల్లో దేశంలోనేకాక ఆయా దేశాల్లో కూడా స్థిరపడ్డారు. ఈ విద్యాలయం నాకు నాయకత్వ లక్షణాలను నేర్పించింది. నేను ఈరోజు ఒక జాతీయ రాజకీయ పార్టీలో ఒక నియోజకవర్గ నాయకుడిగా ఎదిగాను. నవోదయ విద్యాలయం క్రమ శిక్షణే దీనికి కారణం.

క్రాంతి నాయుడు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, పత్తికొండ

మాటల్లో చెప్పలేకపోతున్నా



మా సొంత ఊరు కర్నూలు. నేను హైదరాబాదులోని ఓ వైద్యశాలలో పనిచేస్తున్నాను. మా మిత్రులను కలుసుకున్న ఆనందాన్ని మాటల్లో చెప్పలేను. ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్నాం. ఇక్కడ ఉన్న క్రమశిక్షణే మమ్మల్ని ఈ స్థాయిలో నిలిపింది.

-శిరీష కుమారి, ప్రముఖ వైద్యురాలు, హైదరాబాదు

నేను ఈ స్థాయిలో ఉండడానికి ఈ విద్యాలయమే కారణం:



మాది పక్కనే ఉన్న ఆదోని పట్టణం. నేను 1993 నుంచి 2000 వరకు ఈ విద్యాలయంలోనే చదువుకున్నాను. ఇక్కడి గురువుల విద్యాబోధన, క్రమశిక్షణ నన్ను ఈ రోజు ఈ స్థాయికి ఎదిగేందుకు దోహదపడ్డాయి. ఈ విద్యాలయం ఎంతో మందికి మంచి బంగారు భవిష్యత్తును ఇస్తుంది. అలనాటి నా మిత్రులను కలవడానికి ఇక్కడికి వచ్చాను.

- కల్లిగొట్ల నాగరాజు, డిప్యూటీ కమిషనర్, మేడ్చల్ కమిషనరేట్, హైదరాబాద్

పదేళ్ల తర్వాత కలుసుకున్నాం

మాది నంద్యాల పట్టణం. నేను 1993 నుంచి 2000 వరకు ఇక్కడే చదివాను. పదేళ్ల తర్వాత నేను చదువుకున్న విద్యాలయానికి రావడం, నాతోటి విద్యార్థులను కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నేను ఇక్కడికి వచ్చేందుకు దాదాపు రూ.2 లక్షలు ఖర్చు అవుతోంది. అయినా వచ్చాను. నా చిన్నతనంలో ఇక్కడ మేము నాటక ప్రదర్శించడం ఎప్పటికీ మరచిపోలేను. ఇక్కడ ఉన్న సగం చెట్లలో మేము పెంచినవే.



-అమర్‌నాథ్, సీనియర్ బిజినెస్ మ్యాన్ (ఖతార్, సౌదీ అరేబియా)





టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

మద్దికెర, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాలకు చెందిన టీడీపీ వర్గీయుల మధ్య ఆదివారం ఉదయం ఘర్షణ జరగడంతో ఇరువర్గాలు పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న మండలంలోని బసినేపల్లి గ్రామంలో నీటి సంఘం ఎన్నికల్లో మాజీ ఉప సర్పంచ్ తిమ్మప్ప వర్గానికి చెందిన నారాయణను చైర్మన్‌గా ఎన్నుకోవాలని పట్టుబట్టారు. అయితే.. అధిష్టానం మునిరంగడుకు బాధ్యతలను అప్పగించింది. దీనికి పెరవలి గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరినే కారణమని భావించిన తిమ్మప్ప మాజీ జడ్పీటీసీ పురుషోత్తం చౌదరిని దుర్భాషలాడాడని ఆయన వర్గానికి చెందిన కొంత మంది తిమ్మప్పను ప్రశ్నించడానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య వాగ్వాదం, దాడి జరిగాయి. ఇరు వర్గాల వారు అవతలి వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన టీడీపీలో కుమ్ములాటలను సూచిస్తోంది. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ విజయకుమార్ తెలిపారు.

జాతీయ రహదారిపై కారు, లారీ ఢీ

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

పాణ్యం, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తమ్మరాజుపల్లె సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం కర్నూలు నుంచి నంద్యాల వైపుకు వెళ్తున్న కారును వెనుక వైపు నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు దెబ్బతినింది. కారులో ప్రయాణిస్తున్న వారు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రెండు రోజులుగా రోడ్డు మరమ్మతుల కారణంగా వన్‌వే ఏర్పాటు చేయడంతో వాహనాల రద్దీ, వేగం వంటి సమస్యలతో ప్రమాదాలు జరుగుతున్నాయని పాణ్యం పోలీసులు తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త



హత్యకు గురైన హినాబీ

నందికొట్కూరురూరల్ డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిదిలో గల దామగట్ల గ్రామంలో ఓ భర్త భార్యను హత్య చేశాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. దామగట్ల గ్రామానికి చెందిన రహంతుల్లా తన భార్య హినాబీ (22)ని శనివారం రాత్రి గొంతు నులిమి హత్య హత్య చేశాడు. ఓర్వకల్లు మండలం తిప్పాయ పల్లె గ్రామానికి చెందిన హినాబీకి, రహంతుల్లకు 2021 మే నెలలో వివాహమైంది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవ జరుగుతుండేదని హినాబీ తల్లి పర్వీన్ తెలిపారు. రహంతుల్లాకు ఓర్వకల్లు పోలీసు స్టేషన్లో కౌన్సిలింగ్ కూడా ఇచ్చారని ఆమె తెలిపారు. అయినా రహంతుల్లా భార్యను హింస్తూ వుండేవాడని, అందులో భాగంగానే గత రాత్రి గొంతు నులిమి చంపేశాడని ఆమె తెలిపారు. పర్వీన్ ఫిర్యాదు మేరకు రహంతుల్లా, అత్త నజీమున్నిలపై కేసు నమోదు చేసినట్లు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్సై తిరుపాలు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. నిందితుడు పోలీసుల అదుపులో వున్నట్లు సమాచారం.

ధ్యానం, జ్ఞానంతో ఉత్తమ జీవనం

రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్



రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్‌ను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్, గౌరు చరిత, గౌరు వెంకటరెడ్డి, బీవీ రెడ్డి తదితరులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ధ్యానం, జ్ఞానంతోనే మానవ జీవన విధానంలో మార్పు తెస్తుందని రుద్ర ప్రయాగ పీఠాధిపతి సంత్ సదానందగిరి మహారాజ్ ఉద్బోధించారు. ఆదివారం రాత్రి నగరంలోని రాఘవేంద్రనగర్‌లోగల పిరమిడ్ ధ్యాన కేంద్రంలో 'పౌర్ణమి ధ్యానం - ఆత్మజ్ఞానం' అనే అంశంపై ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యవక్తగా హాజరైన పీఠాధిపతి సదానందగిరి మహారాజ్ మాట్లాడుతూ బ్రహ్మర్షి పత్రీజీ ద్వారా ధ్యానం ప్రపంచానికి పరిచయం అయిందన్నారు. గురువుల ద్వారా పొందిన జ్ఞానాన్ని ప్రజలకు పరిచయం చేస్తూ దేశపర్యటన చేస్తున్నామని అన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ పిరమిడ్ ధ్యాన కేంద్రాల ద్వారా బీవీ రెడ్డి ప్రపంచ వ్యాప్తంగా ధ్యానం ఆవశ్యకతను తెలియజేస్తున్నారని ప్రశంసించారు. ప్రతి ఒక్కరూ ధ్యానంతో ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ధ్యానం బ్రహ్మర్షి పత్రీజీ ద్వారా కర్నూలుకు పరిచయం అయితే, బీవీ రెడ్డి దాన్ని కొనసాగిస్తూ సేవలు అందిస్తున్నారని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పిరమిడ్ ధ్యాన కేంద్రం వ్యవస్థాపకుడు బీవీ రెడ్డి మాట్లాడుతూ సుమారు 30 ఏళ్లనుంచి ఆధ్యాత్మిక రంగంలో ఉన్నానన్నారు. పత్రీజీ ద్వారా ప్రపంచానికి ధాన్య కేంద్రాలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర జీఎస్టీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య, నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య హాజరయ్యారు.

దుకాణాల్లో చోరీ

కోడుమూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు పట్టణంలోని మూడు దుకాణాల్లో చోరీ జరిగింది. స్థానిక కర్నూలు రహదారిలో శివసాయి ట్రాక్టర్ స్పేర్స్ దుకాణం నిర్వాహకుడు సురేష్ శనివారం రాత్రి దుకాణం కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆదివారం ఉదయం దుకాణం తాళాలు పగలగొట్టి ఉండడం గమనించిన కొందరు యజమానికి ఫోన్ చేసి విషయం తెలిపారు. దీంతో చేరుకున్న బాధితుడు దుకాణంలో పరిశీలించారు. దుకాణంలో ఉంచిన నగదు రూ.25 వేలు దోచుకెళ్లారని గుర్తించి లబోదిబోమన్నాడు. అలాగే టీ దుకాణంలో సుమారు రూ. వెయ్యి విలువ చేసే సిగరెట్లు ప్యాకెట్లు దుండగులు ఎత్తుకెళ్లారు. ఇంకో దుకాణంలో చొరబడి ఏమి దొరక్కపోవడంతో వదిలేసి వెళ్లారు. చోరీ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తైక్వాండోలో బంగారు పతకం



చిన్నారి శ్రీలత

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన నాగమల్లి, నరేంద్రబాబు దంపతుల కుమార్తె గువ్వల శ్రీలత తైక్వాండో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. మొదటి తరగతి నుంచి తైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు శిక్షణలో రాణించింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకం సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచింది. 2023 సంవత్సరంలో రైల్వేకోడూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సిల్వర్ పతకం సాధించింది. 2024లో జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో అనేక సార్లు బంగారు పతకం కైవసరం చేసుకుంది. ప్రస్తుతం సిరాక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుకుంటోంది. తల్లిదండ్రులు, అన్న, కోచ్ ప్రోత్సాహంతో జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతం సాధిస్తానంటోంది.

ఐక్యరాజ్యసమితి శాంతి దళానికి ఆర్మీ యువకుడు



జవాన్ బాషా

రుద్రవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలమూరు గ్రామానికి చెందిన బాషా ఇండియన్ ఆర్మీ మెడికల్ విభాగంలో పనిచేస్తూ ప్రపంచ ఐక్యరాజ్యసమితి శాంతి దళానికి ఎంపికైనట్లు ఆదివారం ఆయన తండ్రి సయ్యద్ హుసేన్ తెలిపారు. ఇండియా నుంచి లెబనాన్ దేశంలో ప్రపంచ ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో మెడికల్ విభాగంలో పని చేయడానికి ఎంపిక కావడంతో తండ్రి హర్షం వ్యక్తం చేశారు. ఇండియా నుంచి ఐక్యరాజ్యసమితి శాంతి దళంలో పని చేయడానికి వెళ్లడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు.



పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం



నందికొట్కూరులో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ నాయకులు

నందికొట్కూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయం అని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పట్టణంలోని శ్రీ పొట్టిశ్రీరాములు సర్కిల్ వద్ద ఆదివారం మున్సిపల్ కమిషనర్ బేబి ఆధ్వర్యంలో 72వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, టీడీపీ నాయకులు ముర్తుజావలి, ఆర్టు శ్రీను, మీనాక్షి, లింగమయ్య, జాన్ అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా(ఆంధ్రజ్యోతి): పొట్టిశ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని ఆత్మకూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భీమిశెట్టి కృష్ణమూర్తి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి కళ్యాణ మంటపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఉన్నారు. అదేవిధంగా ఆత్మకూరు ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఉమర్ అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది కళ్యాణ్ ఉన్నారు.

వెలుగోడు(ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, అలాగే ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఎంపీపీ రమేష్, ఎంపీడీవో మధుసూదనరెడ్డి, సిబ్బంది, టీడీపీ నాయకులు ఖలీల్, సంజీవరాయుడు, రాము, సుబ్రమణ్యం, జనసేన నాయకులు షాలుబాషా, ఆర్యవైశ్య నాయకులు బీవీ సత్యనారాయణ, నాగార్జున, ప్రసాద్, జనార్దన్, పరుచూరి కుమార్, రవి, మల్లికార్జున, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు పోరాటాన్ని, త్యాగనిరతిని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం నందమూరినగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయంలో జరిగిన కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విద్యాలయ నిర్వాహకులు సుబ్బరాయుడు, రాజేశ్వరమ్మ, హాస్టల్ వార్డెన్ నాగలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల కల్చరల్(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘము, నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం, వాసవి ఆర్యవైశ్య సంఘం, వైశ్య యువజన సంఘం, అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతిపరిరక్షణ సమితి, మహిళామండలి, ఆర్యవైశ్య పరిరక్షణ సమితి, ఇతర సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య ప్రముఖుల చేసి సంజీవనగర్ కూడలిలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవఅధ్యక్షులు బింగుమళ్ల శ్యామ్ సుందర్ గుప్తా, జిల్లా అధ్యక్షులు భవనాశి నాగమహేష్, ఆర్యవైశ్య పొలిటికల్ చైర్మన్ ఖండే శ్యామ్‌సుందర్‌లాల్, మహిళామండలి సభ్యులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ప్రసాద్, ఇనుగూరి రమేష్, బిజెపి చంద్రశేఖర్, లాయర్ రావినూతల దుర్గాప్రసాద్, తదితరలు పాల్గొన్నారు.

పాణ్యం(ఆంధ్రజ్యోతి): పాణ్యంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, ఈవోఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల క్రైం(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని నంద్యాల పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు ఆదివారం అమరజీవి వర్ధంతి సందర్భంగా నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో పట్టణ డీఎస్పీ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, నాగభూషణం, శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్ధంతిని పురస్కరించుకొని ప్రముఖుల నివాళి





ఆత్మకూరు, వెలుగోడులో పొట్టి శ్రీరాములకు నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



నంద్యాలలో నివాళి అర్పిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది









నంద్యాలలో నివాళి అర్పిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి, జూపాడుబంగ్లాలో రెవెన్యూ అధికారి, పాణ్యంలో ఎంపీడీవో, సిబ్బంది, నంద్యాలలో నివాళి అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

'కార్యకర్తలకు అండగా ఉంటాం'



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి

నందికొట్కూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య, టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలో టీడీపీ గ్రామ నాయకుడు గోరంట్ల రామకృష్ణ తల్లి గోరంట్ల సుబ్బమ్మ(65) మృతి చెందడంతో ఆదివారం ఆమె మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. రామకృష్ణకు, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, సర్పంచ్ చిన్న నాగలక్ష్మయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'భాష్ప వాయువు ప్రయోగించడం అమానుషం'



మాట్లాడుతున్న నరసింహులు

నందికొట్కూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పంజాబ్, హర్యానా సరిహద్దుల్లో రైతాంగం పండించిన అన్ని పంటలకు కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని హర్యానా పోలీసులు మూడోసారి అడ్డుకున్నారని, వారిపై భాష్పవాయువు ప్రయోగించడం అమానుషం అని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.నరసింహులు అన్నారు. శంభు సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన రైతులపై భాష్ప వాయువు ప్రయోగించి జల ఫిరంగులతో రైతులను చెల్లాచెదురు చేశారని, 15 మంది రైతులకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పారు. ఉద్రిక్త పరిస్థితి ఏర్పాడిందని, ఈ నెల 17వ తేదీ వరకు అంబాల పరిసర ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రభుత్వం నిలిపి వేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వం రైతాంగం వ్యతిరేక వైఖరి స్పష్టం అయిందని అన్నారు. రైతులు తమ గళాన్ని వినిపించడానికి ఢిల్లీ వస్తుంటే అడుగడుగునా ప్రతిబంధకాలతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు శివ, ఎల్లనాయుడు, పుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి



దత్తాత్రేయుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): నంద్యాల బొమ్మలసత్రం సాయిబాబామందిరంలో ఆదివారం దత్తజయంతి సందర్భంగా దత్తాత్రేయుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం దత్తాత్రేయుడికి అభిషేకాలు, మధ్యాహ్నం హారతి ఇచ్చారు. అనంతరం ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సాయిబాబా సేవా సమితి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి



మహానందీశ్వరుడి దర్శనం కోసం క్యూలో నిలిచి ఉన్న భక్తులు

మహానంది, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఆదివారం వేలాదిమంది భక్తులు స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. శనివారం రాత్రే తెలుగు రాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వివిధ వాహనాల ద్వారా భక్తులు తరలి వచ్చారు. తెల్లవారుజామున్నే ఆలయ ప్రాంగణంలోని కోనేర్లల్లో పుణ్య స్నానాలు ఆచరించారు. వేకువజామున స్వామి, అమ్మవార్లకు ఇచ్చే మహా మంగళ హారతి సేవలో పాల్గొన్నారు.

'క్రీడాస్ఫూర్తిని పెంచుకోవాలి'



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ ఫసిఫిల్ మున్నా సూచించారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆత్మకూరు బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి విద్యార్థులు, యువత మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండేందుకు క్రీడల పట్ల మక్కువ పెంచుకోవాలన్నారు.క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు.క్రీడలను ప్రోత్సహించేందుకు, క్రీడాకారులను తీర్చి దిద్దేందుకు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి సహకారంతో కృషి చేస్తోందన్నారు.అనంతరం ఆత్మకూరు జూపాడు బంగ్లా, అబ్దుల్లాపురం, పాములపాడు జట్ల మధ్య జరిగిన హోరాహోరి మ్యాచ్‌లో ఆత్మకూరు జట్టు విజయం సాధించింది. రైల్వే వాలీబాల్ కోచ్ నిమ్మికృష్ణ యాదవ్, కబడ్డీ కోచ్ వెంకటేష్ గౌడ్, తైక్వాండో కోచ్ స్వామన్న, ఖోఖో కోచ్ మహబూబ్ బాషా, సీనియర్ క్రీడాకారులు వెంకటేశ్వరరావు, మురళీధరరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన సభ



పతకాలు సాధించిన క్రీడాకారిణులతో డాక్టర్ రవికృష్ణ

నంద్యాల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కెనోయింగ్, కేయాకింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాలలో నవంబరులో జరిగిన రాష్ట్ర స్థాయి పడవ పోటీల్లో జిల్లా జట్టులో నంద్యాలకు చెందిన క్రీడాకారిణులు పతకాలు సాధించారని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నంద్యాల క్రీడా సమాఖ్య అధ్యక్షుడు డా.రవికృష్ణ తెలిపారు. ఆదివారం నంద్యాలలోని క్రీడా సమాఖ్య కార్యాలయంలో క్రీడాకారిణులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. డ్రాగన్ బోట్ పడవ పోటీ మిక్స్‌డ్ విభాగంలో వర్ష, స్పందన, తబిత మొదటి స్థానం సాధించి బంగారు పతకాలు సాధించారన్నారు. కేయాకింగ్ వ్యక్తిగత పడవ పోటీ విభాగంలో ముగ్గురు క్రీడాకారిణులు కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులను డా.రవికృష్ణ తదితరులు అభినందించారు.

'టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు ధీమా'



సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

వెలుగోడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): టీడీపీ చేపట్టిన సభ్యత్వ నమోదుతో కార్యకర్తలకు ఎంతో ధీమా ఉంటుందని టీడీపీ నాయకులు జాకీర్ హుసేన్, ఖలీల్ అన్నారు. ఆదివారం వెలుగోడులోని 19వ వార్డులో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ రూ. 100తో సభ్యత్వం తీసుకుంటే రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీపీ షాకీర్, జునైద్, వార్డు ఇన్‌చార్జి చిన్న అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా

ఆత్మకూరు రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆత్మకూరులో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీకాంత రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని నిరుద్యోగుల కోసం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సహకారంతో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని దుద్యాల రోడ్డు పాత ఈద్గా వద్ద ఉన్న కేవీకే స్టేడియం ప్రాంగణంలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ జాబ్‌మేళాకు డిక్సన్ టెక్నాలజీస్, రాకమ్యాన్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, భారత్ ఫిల్, అరబిందో ఫార్మా, ఫ్యూచర్ ప్రాపర్టీకికి చెందిన 5 ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 6303244165, 7673902328 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సాగు నీటి సంఘాల అధ్యక్షుల ఎన్నిక

పాణ్యం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎస్సార్బీసీ, మైనర్ ఇరిగేషన్ కింద గల 15 సాగునీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు శనివారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో ఎస్సార్బీసీ సాగునీటి సంఘం 2వ బ్లాకుకు యేలంపల్లి శివనాగిరెడ్డి, 4వ బ్లాకుకు గూడ చంద్రశేఖరరెడ్డి, 7వబ్లాకుకు దేవసాని సురేంద్ర, 8వ బ్లాకుకు నూకరాజగోపాల్‌రెడ్డి, 9వబ్లాకుకు ఎం.నారాయణ రెడ్డి, 10వ బ్లాకుకు కేశిరెడ్డి రామపుల్లారెడ్డి, 11వ బ్లాకుకు అన్నపురెడ్డి మహేశ్వరరెడ్డి, 12 వబ్లాకుకు సన్నల విశ్వేశ్వరరెడ్డి, 13వ బ్లాకుకు బండారు నారాయణ ఎన్నికయ్యారు. మైనర్‌ఇరిగేషన్ కింద గల ఆలమూరు పెద్ద చెరువుకు భీమనాయుడు, భూపనపాడు వత్తుల వాగు చెరువుకు చిన్న ఎనుముల సుశీల, వడ్డుగండ్ల చెరువుకు మంగమ్మగారి మోహన్, పాణ్యం ఊరిముందరి చెరువుకు వెంకటేశమయ్య ఆచారి, కొల్లమాగుల చెరువుకు దేశావత్ రాముడు నాయక్, కొండజూటూరు చెరువుకు జిల్లెల్ల సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

గాయత్రీ విశ్వకర్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల విశ్వనగర్‌లో వెలసిన గాయత్రీ విశ్వకర్మ దేవాలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భాగంగా గాయత్రీవిశ్వకర్మ భగవానులకు 108మంది భక్తులచే 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం 108 భక్తులతో ఒక్కొక్కరు 5 దీపాలు చేతబట్టుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తులతో కోలాట ప్రదర్శన నిర్వహించారు.

నేడు మరకత లింగేశ్వరుడికి ఆరుద్ర పూజలు

మహానంది, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని గంగా గౌరి సమేత మరకత లింగేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఆరుద్ర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత కనుమర్లపూడి మస్తాన్‌రావు ఆదివారం తెలిపారు. శివలింగ దర్శనం, శివాభిషేకంతో పాటు ఘనంగా అన్నాభిషేకాన్ని ప్రత్యేక రుత్వికులు వేదమంత్రాలతో నిర్వహించనున్నట్లు తెలిపారు.

అర్ధరాత్రి అక్రమ తవ్వకాలు

- అసైన్డ్ భూములపై మట్టి మాఫియా కన్ను
- ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తున్న వైనం



గాజులపల్లి ప్రధాన రహదారిలో వాహనాల్లో ఎర్రమట్టిని తరలిస్తున్న దృశ్యం



మహానంది, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి సరిహద్దు ప్రాంతంలో అర్ధరాత్రి ఎర్రమట్టిని తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఇటుకల తయారీ కోసం నల్లమల సమీపంలోని ప్రభుత్వ అసైన్డ్ భూములపై మాఫియా కన్ను పడింది. అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఎక్స్‌కావేటర్ సాయంతో మహానంది- రుద్రవరం మండలాల సరిహద్దులోని పొలాల్లో అక్రమంగా ఎర్ర మట్టిని తవ్వి వాహనాల సహాయంతో నంద్యాల సమీపంలోని ఇటుకల బట్టీలకు తరలిస్తున్నారు. పదుల సంఖ్యలో వాహనాలను ఏర్పాటు చేసుకొని తెలుగుగంగ ప్రధాన కాలువ మార్గం ద్వారా తరలిస్తున్నారు. గాజులపల్లి రహదారి వెంట అతి వేగంగా వెళ్లడంతో అటువైపు వెళ్లే వాహనదారులు ప్రయాణించడానికి ఇబ్బందులు పడుతున్నారు. మట్టిమాఫీయాకు రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. ఎర్రమట్టి అక్రమ రవాణాపై అధికారులు పట్టించుకోక పోవడంతో ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిఘా ఉంచి అరికట్టాలని కోరారు.

రోడ్లు ఇలా.. గమ్యం చేరేదెలా?

- అధ్వానంగా రహదారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలు పడ్డ భావాపురం రహదారి

కొత్తపల్లి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్యాల, లింగాపురం, భావాపురం, సింగరాజుపల్లి, గుమ్మడాపురం, మునలిమడుగు, ఎర్రమటం తదితర గ్రామాలకు సంబంధించిన రహదారులు గుంతలమయ మయ్యాయి. ఈ గ్రామాల గుండా వెళ్లే ఆటోలు, ద్విచక్ర వాహనదారులు, ప్రజలు, నాలుగు చక్రాల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్ల గురించి పూర్తిగా పట్టించుకోకపోవడంతో.. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తూతూ మంత్రంగా అక్కడక్కడ ప్యాచ్ వర్కులు చేసి మమ అనిపించడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గతుకులమయమైన రహదారులపైన దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న ఆత్మకూరు-దుద్యాల రోడ్డు

క్రీడాకారులకు ప్రోత్సాహం



షటిల్ పోటీలు ప్రారంభిస్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : భూమా కుటుంబం క్రీడాకారులకు ఎల్లవేళలా తగిన ప్రోత్సాహం అందిస్తుందని టీడీపీ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి అన్నారు. దివంగత ఎమ్మెల్యే భూమా శోభానాగిరెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని భూమా బాలిరెడ్డి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి షటిల్ టోర్నమెంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. తల్లిదండ్రులు, దివంగత ఎమ్మెల్యేలు భూమా నాగిరెడ్డి, భూమా శోభా నాగిరెడ్డి చిత్రపటాలకు విఖ్యాత్‌రెడ్డి పూలమాల వేసి నివాళి అర్పించారు.

సుబ్బారెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్బారెడ్డిస్వామి

ఉయ్యాలవాడ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడ గ్రామ సమీపంలో కుందూనది ఒడ్డున వెలసిన వేణుగోపాలా స్వామి ఆశ్రమంలో ఆదివారం మార్గశిర పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిపారు. ఆశ్రమ నిర్వాహకులు మహానందరెడ్డి సుబ్బారెడ్డిస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు. కార్యక్రమంలో నాగేశ్వ రరెడ్డి ఉన్నారు.

జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక

చాగలమర్రి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సూపర్-7 సబ్ జూనియర్ నంద్యాల జిల్లా క్రికెట్ జట్టును ఆదివారం ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా కార్యదర్శి మహబూబ్‌బాష మాట్లాడుతూ స్థానిక క్రీడా మైదానంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన సబ్‌జూనియర్ క్రికెట్ క్రీడాకారులకు ఒకరోజు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణలో సుమారు 60మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన 15 మంది క్రీడాకారులను జిల్లాజట్టుకు ఎంపిక చేస్తామని అన్నారు. ఈనెల 22న కడపలో జరిగే రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ సూపర్-7 క్రికెట్ పోటీలో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో జాతీయ క్రీడాకారులు జంషీర్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు బిల్లును నిలిపేయాలి



కడపకు తరలివెళ్తున్న ముస్లింలు, మత పెద్దలు

చాగలమర్రి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారం ఉన్న బీజేపీ ప్రభుత్వం వక్ఫ్‌బోర్డ్ ఆధీనంలో ఉన్న సుమారు 90 వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్న వక్ఫ్‌బోర్డ్ బిల్లును నిలిపి వేసే వరకు నిలిపి వేసే వరకు ఉద్యమం ఆగదని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఆదివారం కడప పట్టణంలోని ఆజాద్ నగర్ మైదానంలో జమాఅతే ఉల్మాహింద్ సంస్థ చీఫ్ మౌలానా అర్షద్ మదని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సభకు చాగలమర్రి నుంచి వేలమంది ముస్లింలు వెళ్లారు. ఈ సందర్భంగా అన్సర్ బాషా మాట్లాడుతూ కేంద్రంలో అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం దేశ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని గాలికివదిలి కులమతాల మధ్య చిచ్చు రేపి దేశ ఐక్యతను, సమగ్రతను మంటగలుపుతుందని విమర్శించారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుకోవడానికి పార్టీలకతీతంగా పోరాటం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో జమాతే ఉల్మాహింద్, తాలుకా ఇన్‌చార్జి మౌలానా ఖతీబ్, అబ్దుల్‌మజీద్, ఆరిఫ్ ఉన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల) : జమయితే హింద్ ఉలమా పిలుపు మేరకు కడపలో జరిగిన భారీ బహిరంగ సభకు ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి తదితర మండలాల నుంచి ముస్లింలు ఆదివారం భారీగా తరలివెళ్లారు. రాజ్యాంగ పరిరక్షణ, వక్ఫ్ బోర్డు ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై జరిగిన సమావేశంలో ముస్లింలు పాల్గొన్నారు. కార్యక్రమంలో జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ బీరువాల బాషా, కాంగ్రెస్ సమన్వయకర్త హుసేన్ బాషా, మౌలానా రఫీ, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

శిరివెళ్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మైనార్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన అధ్యక్షుడు ఫజలె రబ్బాని అన్నారు. ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ శిరివెళ్ల డివిజన్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఫజలె రబ్బాని, జనరల్ సెక్రటరీగా ఇద్రుస్ బాషా, కోశాధికారిగా నూరుల్లా, హానరరీ ప్రసిడెంట్‌గా మహబూబ్ బాషా తదితరులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ ఫరూక్, నబీరసూల్, గౌస్ బాషా పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధే టీడీపీ లక్ష్యం



హోసన్న మందిరంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

బేతంచెర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి టీడీపీ లక్ష్యమని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని దుర్గాపేటలో ఉన్న హోసన్నా మందిరంలో సెమి క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే కోట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి క్రిస్టియన్లకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కోట్ల, క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామి దాసు, టీడీపీ నాయకులు మేకల నాగరాజు, రూబెన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో హోసనా మందిరం పాస్టర్ సామేల్, కౌన్సిలర్లు రామగోపాల్, రామాంజనేయులు, రామ్మూర్తి, శ్రీపతి నాగరాజు, కానాల అంజి, మహిళలు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దొర్నిపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండుపాపల గ్రామంలో మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఆదివారం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశారు. 23 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎవరైన బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిది

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి
- అమరజీవి చిత్రపటానికి నివాళి

బేతంచెర్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మార్పణం చేసుకున్న అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో, అమ్మవారిశాలలో ప్రభుత్వ కార్యాలయాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ హరిప్రసాద్, ఆర్యవైశ్య సంఘం మండల ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, సమన్వయ చైర్మన్ చంద్రశేఖర్, తిరుమలేష్ చౌదరి, భీమేశ్వరరెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్లు రామగోపాల్, రామాంజనేయులు, రామ్మూర్తి, ఇబ్రహీం, రామగోపాల్, రామాంజనేయులు, నంద్యాల మధు, ఎల్లయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డోన్ రూరల్: తెలుగు బాషా, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా ఆదివాకం డోన్‌లో ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషణ్, టీడీపీ నాయకులు ఓంప్రకాష్, రవి, వలసల బాలుడు, బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్డె మహారాజ్, జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం పాల్గొన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండు ప్రధాన రోడ్డులో ఉన్న పొట్టి శ్రీరాముల విగ్రహానికి మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, నాయకులు శ్రీరాములు, సోమేష్ యాదవ్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, నరసింహారెడ్డి, గోపాల్ నివాళి అర్పించారు. డోన్ మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కమిషనర్ ప్రసాద్‌గౌడు నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం నివాళులర్పించారు. చాగలమర్రిలోని గాంధీసెంటర్‌లో ఆర్యవైశ్య అధ్యక్షుడు లక్ష్మణబాబు ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పోలీసు స్టేషన్‌లో హెచ్‌సీ వెంకటరెడ్డి, శంకర్ ఆధ్వర్యంలో మండలపరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకులు బాల నరసింహులు ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు చిత్రపటాకి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆవోపా నాయకులు, పోలీసు సిబ్బంది, మండలపరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): అమరజీవి పొట్టి శ్రీరాములు రాష్ట్రానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఆళ్లగడ్డ మున్సిపల్ కౌన్సిలర్ కిషోర్ అన్నారు. ఆత్మార్పణ దినోత్సవం, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పురపాలక సంఘంలో ఆయన చిత్రపటానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళి : ఆవోప ఆళ్లగడ్డ సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆవోప ప్రతినిధులు ప్రభాకర్, గోవిందరాజులు, సుబ్రమణ్యం, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం అధ్యక్షుడు అమీర్ బాషా, శ్రీనివాసులు, రాంప్రసాద్, ప్రవీణ్ కుమార్, కృష్ణమూర్తి, రాజా భరత్, వినయ్ కుమార్ పాల్గొన్నారు.



బేతంచెర్ల ఆర్అండ్‌బీ గెస్టు హౌస్‌లో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

ఉయ్యాలవాడ: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహారదీక్ష మరువలేనిదని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక గ్రామ సచివాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించగా, ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయురాలు మాధవీలత, విద్యార్థులు పూలమాల వేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేకల ఓబులేసు, కార్యదర్శ జయరామిరెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కోవెలకుంట్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు, త్యాగాలు మరువలేనివని ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం ఆర్యవైశ్యులు శ్రీరాములు విగ్రహనికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సన్నిధి చంద్రశేఖర్, పెండేకంటి నాగరాజు, నాగేశ్వరావు, కన్నయ్య, శేషపాని, నాగరాజు. రాజరామయ్య, కర్నాటి వెంకటసుబ్బయ్య, సత్యనారాయణ, ఆనంద్‌బాబు, సుబ్రమణ్యం, శివనాగయ్య, ఆర్యవైశ్య యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డలో నివాళి అర్పిస్తున్న ఆవోప ప్రతినిధులు



డోన్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్టీ నాయకులు



ఉయ్యాలవాడ ఆదర్శ పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయురాలు, విద్యార్థులు



కోవెలకుంట్లలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు



చాగలమర్రిలో పొట్టి శ్రీరాములకు నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

మెరుగైన రోడ్లను నిర్మించడమే లక్ష్యం: మంత్రి బీసీ

బనగానపల్లె , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెరుగైన రోడ్లును నిర్మించి వాహనాలకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని రోడ్లు భవనాల శాఖామంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బనగానపల్లె -పాణ్యం మధ్య జరుగుతున్న రోడ్ల మరమ్మతు పనులను మంత్రి పరిశీలించారు. బనగానపల్లె మండలం నందవరం గ్రామ సమీపంలో నిర్మిస్తున్న రోడ్డు పనులను తనిఖీ చేశారు. సంక్రాంతి నాటికి గుంతల రహిత రహదారులే లక్ష్యంగా రూ.861 కోట్ల వ్యయంతో రాష్ట్ర వ్యాప్తంగా మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులను పలు జిల్లాల్లో పర్యటించి పరిశీలించామన్నారు.పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను కోరినట్లు తెలిపారు. బనగానపల్లె పాణ్యం రోడ్డు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.

జుర్రేరు వాగు వంతెన పరిశీలన

బనగానపల్లె పట్టణ నడిబొడ్డున ఉన్న జుర్రేరువాగు వంతెన మరమ్మతు పనులను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇటీవల వాగుపై చేపట్టిన వంతెన మరమ్మతు పనులు త్వరగా పూర్తి అవడంపై మంత్రి హర్షం వ్యక్తం చేశారు. అలాగే జుర్రేరు వాగు శుద్ధీకరణ పనులు కూడా పరిశీలించారు. ప్లాస్టిక్ రహిత పట్టణాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. వాగు ప్రక్షాళన పనులు కూడా వేగవంతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.



రోడ్డు మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లెలో ప్రజా దర్బార్

పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఉదయం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించారు. చిన్న చిన్న సమస్యలు అక్కడికక్కడే మంత్రి పరిష్కరించారు. ఇతర సమస్యలను సంబంధిత అధికారులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే క్యాంపు కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పలువురి బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పంట కాల్వలను అభివృద్ధి చేయాలి

ఎస్సార్బీసీ పంట కాల్వలు, చెరువుల అభివృద్ధికి సాగునీటి సంఘాల బాధ్యులు కృషి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సూచించారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మంత్రిని పలువురు సాగునీటి సంఘాల చైర్మన్లు కలిశారు. ఈ సందర్భంగా బాధ్యులను అభినందించారు. మంత్రి బీసీ మాట్లాడుతూ రైతులకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

అవుకు: మండలంలో నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల బాధ్యులు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం అన్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన గుండ్లశింగవరం నెంబర్ 34, వేములపాడు గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, నాగశేషమ్మ, శ్రీనివాసులు, లింగాలశివుడు, సభ్యులు వేములపాడు గుర్రప్ప మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. బాధ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు.

ఆలయంలో మాజీ మంత్రి పూజలు

డోన్ రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పురోహితులు ఆశీర్వాదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఉన్నారు.

రేపు ఉద్యోగ మేళా

ప్యాపిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఈ నెల17న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ కోర్సులు చేసిన నిరుద్యోగులు అర్హులన్నారు. అభ్యర్థులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయం



ప్యాపిలిలో సభ్యత్వ నమోదులో టీడీపీ నాయకులు

ప్యాపిలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని మాజీ ఎంపీపీ టి శ్రీనివాసులు, సీనియర్ నాయకులు రామ్మోహన్‌యాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సభ్యత్వం చేసుకున్న కార్యకర్తలను పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయులు నాగేంద్ర, గండికోట పెద్దరామాంజినేయులు, నరేంద్రయదవ్, శ్రీను, ఓబులేసు పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

కొలిమిగుండ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన జింకల మధు అనే వ్యక్తిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఆదివారం వెల్లడించారు. మోటార్ సైకిల్ పార్కింగ్ విషయంలో గొడవ పడి చంద్రమోహన్, రమణయ్య, శేఖర్ అనే ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా - ముగ్గురికి గాయాలు

కొలిమిగుండ్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనకాద్రిపల్లె గ్రామ సమీపంలో శనివారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలకు గాయాలైనట్లు స్థానికులు వెల్లడించారు. తాడిపత్రి వైపు నుంచి అవుకు వెళుతున్న ఆటో మలుపు వద్ద బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు గాయాలు కాగా ప్రైవేటు వాహనంలో ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

మూల పెద్దమ్మకు ప్రత్యేక పూజలు

దొర్నిపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి గాజులు, పట్టువస్త్రాలతో అలంకరించి కుంకుమార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను కమిటీ సభ్యులు అందజేశారు.

సేవా గుణాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కోవెలకుంట్ల, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి సేవా గుణాన్ని అలవర్చుకోవాలని రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ చిన్నపురెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీక్లబ్ ఆవ ణంలో రోటరీ పదిమంది పేదవిద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సెక్రెటరీ విజయశేఖర్‌రెడ్డి, అసిస్టెంటు గవర్నర్ రవికుమార్, అధ్యక్షులు శ్రీనివాసులు, ఉప అధ్యక్షులు వెంకటరాముడు, సభ్యులు పెండేకంటి సుబ్రహ్మణం, డాక్టర్ బాలాంజనేయరెడ్డి, రిటైర్డ్ లెక్చలర్ వెంకటేశ్వరరెడ్డి, జీవీ శేషారెడ్డి, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాల లోగోను విడుదల చేస్తున్న మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి

బనగానపల్లె , డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తన తల్లిదండ్రులు బీసీ గుర్రెడ్డి, బీసీ లక్ష్మమ్మ జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదోతరగతి పరీక్షల్లో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధిస్తే ఆ విద్యార్థికి రూ.లక్ష నగదు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలోని ఐదు మండలాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధిస్తే రూ. లక్ష, మండల స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థులకు రూ.50వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు నగదు ప్రతిభా పురస్కారాలకు సంబంధించిన వివరాలను విద్యార్థులకు తెలిపి ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డు హెచ్‌ఎం పక్కీర్‌రెడ్డి, రోటరీక్లబ్ సభ్యుడు రఘురామయ్య, రిటైర్డ్ టీచర్ నాగపుల్లయ్య, విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి


చాగలమర్రి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పట్టణంలోని సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితులు నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలచే దత్త వ్రతం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కొలిమిగుండ్ల : మండలకేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో దత్త జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వీడీ రాజగోపాల్, రామక్రిష్ణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పౌర్ణిమ, మార్గశిర మాసం, దత్త జయంతి పురస్కరించుకొని స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు, నిర్వహించి, నూతన వస్త్రాలు అలంకరించారు. అర్చకులు రాంప్రసాద్ దత్తాత్రేయ స్వామి వద్ద విశేష దీపాలంకరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



చాగలమర్రి సాయి బాబా మందిరంలో దత్త వ్రతం చేస్తున్న మహిళలు

సాగునీటి సంఘాల చైర్మన్లు ఏకగ్రీవం



ఆలమూరు చీలబోయిన చెరువు సంఘం చైర్మన్‌గా ఎంపికైన పత్తి బ్రహ్మయ్యతో అధికారులు

రుద్రవరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగునీటి చెరువుల కమిటీ సంఘాల చైర్మన్లను ఎన్నుకున్నట్లు తహసీల్దార్ మల్లికార్జునరావు తెలిపారు. ఆలమూరు చీలబోయిన చెరువు చైర్మన్‌గా పత్తి బ్రహ్మయ్య, చందలూరు రాళ్లవాగు చైర్మన్‌గా పల్లె హేమలత, పెద్ద చెరువు చైర్మన్‌గా ప్రభావతి, బీరవోలు చెరువు చైర్మన్‌గా చిన్న నాగన్న, చిన్నకబంలూరు కొత్త చెరువు చైర్మన్‌గా పెద్ద పుల్లారెడ్డి, కొండమాయల్లె చిన్నరాజు చెరువు చైర్మన్‌గా వెంకట రమణమ్మ, పెద్దకంబలూరు కేశవరాజు చెరువు చైర్మన్‌గా పెద్ద లింగారెడ్డి, నాగిరెడ్డిపల్లె సోమయాజుల చెరువు చైర్మన్‌గా చిన్న నరసింహులు, రుద్రవరం పెద్దరాజు చెరువు చైర్మన్‌గా వెంకట రమణ, రుద్రవరం రంగారెడ్డి చెరువు చైర్మన్‌గా గురుస్వామి, మాచినేనిపల్లె చిన్న చెరువు చైర్మన్‌గా సంగా శ్రీనివాసులు, చిన్నకంబలూరు కాటమ్మ చెరువు చైర్మన్‌గా శంకర్‌రెడ్డి, ముకుందాపురం ఎర్ర చెరువు చైర్మన్‌గా సంజీవరాయుడు, తువ్వపల్లె వెంగనపల్లె చెరువు చైర్మన్‌గా వెంకట రమణగౌడ్, టీ లింగందిన్నె చింతల చెరువు చైర్మన్‌గా వెంకట నరసింహులు టీడీపీ వర్గీయులు ఎన్నికైనట్లు తహసీల్దార్ తెలిపారు.